

రాజ్యాంగంపై దాడి ప్రజాస్వామ్యానికి ప్రమాదం : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - భీమవరం

అంబేద్కర్‌పై, రాజ్యాంగంపై ఏమాత్రమూ గౌరవం లేకుండా సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలతో అవమానకరంగా మాట్లాడిన తెలంగాణకు చెందిన ఆర్ఎస్ఎస్ మతోన్మాది హమారా ప్రసాద్‌ను శిక్షించాలని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. రాజ్యాంగంపై దాడి ప్రజాస్వామ్యానికే ప్రమాదమని, రాజ్యాంగ విలువ తెలుసుకోకుండా అవివేకంగా అనుచిత వ్యాఖ్యలు చేసి ప్రజల మధ్య మత విద్వేషాలు రేకెత్తించే చర్య దేశద్రోహమని, వెంటనే దేశద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవిఎస్.శర్మ, గేదెల ధనుష్ ఒక ప్రకటన విడుదల చేశారు. గాంధీని చంపిన గాడ్సే కీర్తించదగిన వ్యక్తి అంటూ హమారా ప్రసాద్ మాట్లాడటం దారుణమన్నారు. అంబేద్కర్ బతికి ఉంటే గాంధీని గాడ్సే చంపినట్లు అంబేద్కర్‌ని చంపేవాడినని ప్రసాద్ ఉగ్రవాదిలా మాట్లాడడం ఉపేక్షించరాదన్నారు.

నది గర్భాన్నీ తవ్వేస్తున్నారు..!

అడ్డగోలుగా లంకల్లో తువ్వఇసుక తవ్వకాలు - భారీ వాహనాల రాకపోకలతో చించినాడ ఏటిగట్టు ధ్వంసం - పట్టించుకోని ఉన్నతాధికారులు

ప్రజాశక్తి - యలమంచిలి

సామాన్యుడు ఇంటి నిర్మాణానికి ఒక ట్రాక్టర్ మట్టిని తీసుకువెళ్తే ఆ ట్రాక్టర్‌ను సీజ్ చేసి, కేసులు నమోదు చేసి ఇబ్బందులు పెట్టే సంఘటనలు మనం నిత్యం చూస్తూ ఉంటాం.. కానీ మట్టి తవ్వకాలకు నిషిద్ధ ప్రాంతాలైన గోదావరి పరివాహక ప్రాంతాలు, లంకల నుండి యథేచ్ఛగా తువ్వఇసుకను తరలిస్తుంటే కనీసం నోరుమెదపడం లేదు. యలమంచిలి మండలం ఏనుగువానిలంక పరిధిలోని చించినాడ గ్రామానికి చెందిన లంక భూముల నుండి సుమారు 15 రోజులుగా భారీ పొక్లెయిన్లను ఉపయోగించి నదీ గర్భాన్ని గుల్ల చేసి మరీ పది టన్నుల భారీ లారీలతో ఇతర ప్రాంతాలకు తువ్వ ఇసుకను తరలిస్తున్నారు. దీనికి ప్రభుత్వ అధికారులే అండగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. దీంతో సామాన్యులకు ఒక న్యాయం.. ఇతరులకు ఒక న్యాయమా అని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనికి సంబంధించి స్థానికులు చెబుతున్న వివరాల ప్రకారం మండలంలోని చించినాడ ఏనుగువానిలంక గ్రామాల పరిధిలో సుమారు 30 సంవత్సరాలుగా పెరుగులంక భూములను పేదలంతా వివిధ రూపాల్లో సాగు చేసుకుంటున్నారు. అయితే కరోనా తర్వాత ఆర్థిక ఇబ్బందులతో ఆ లంకలను ఖాళీగా వదిలేయడం వల్ల తుప్పలు పెరిపోయాయి. ఈ తుప్పలను పేదలంతా మూకుమ్మడిగా తొలగించేందుకు కొద్దికాలం క్రితం ప్రయత్నించారు. ఈ క్రమంలో అధికారులు అడ్డుకున్నారు. అ తర్వాత ఈ లంకల నుండి అధికారులు ఇతర మండలాలలో జగనన్న ఇళ్ల స్థలాల పూడికకు తువ్వ ఇసుకను తరలించేందుకు అధికారులు ప్రయత్నించారు. ఆ సమయంలో గ్రామ ప్రజలంతా అడ్డుకున్నారు. అయితే ప్రస్తుతం మట్టి తవ్వకాలకు జిల్లా అధికారులు అనుమతులున్నాయని దీనికి అడ్డు వస్తే పద్ధతిగా ఉండదని పేదలను భయపెట్టి దౌర్జన్యంగా ఇక్కడి తువ్వ ఇసుకను తరలిస్తున్నారని గ్రామానికి చెందిన కేతా రాము, బుంగ శంకరుడు, ముమ్మిడివరపు ఆంజనేయులు, బూసి చిట్టిబాబు, చెల్లుబోయిన వడ్డీ కాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏటుగట్టు ధ్వంసం..

సాధారణంగా ఏటిగట్టుపై ఎడ్లబండ్లు, రైతులకు చెందిన ట్రాక్టర్లు వెళితే ఆంక్షలు విధించే ఏటిగట్టు పరిరక్షణ అధికారులు భారీ లారీలతో యథేచ్ఛగా మట్టిని తరలిస్తూ గట్టును ధ్వంసం చేస్తున్నా పట్టించుకోవడం లేదు. గట్టు కుంగిపోతుందని, నిన్న మొన్నటి వరదల సమయంలో ఏటిగట్టు ఎక్కడ గండి పడుతుందోనని ప్రాణ భయంతో స్థానిక ప్రజలు ఏటిగట్టును రాత్రింబవళ్లు కాపలా కాసి కాపాడుకున్నారని, ఏటిగట్టును పరిరక్షించాల్సిన అధికారులే ఇలా వ్యవహరించడం పలు విమర్శలకు దారితీస్తుంది.



తువ్వ ఇసుకను తవ్వడం వల్ల ఏర్పడిన గోతులు



తువ్వ ఇసుకను తవ్వుతున్న పొక్లెయిన్

లంక భూములు కాపాడుకుంటాం
కెవిపిఎస్ మండల నాయకులు, చించినాడ

30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న లంక భూములను, పేదలు సాగు చేసుకోకుండా అడ్డుకున్న అధికారులు గోదావరి వెంబడి ఇతర భూస్వాములు గెస్ట్‌హౌస్‌లు నిర్మించుకుని, రొయ్యల చెరువులు సాగు చేసుకుంటున్నా పట్టించుకోకపోవడం దారుణం. ప్రభుత్వ అధికారులకు పేదలంటే ఎంత చులకన భావం ఉందో దీన్ని బట్టి అర్థమవుతుంది. రాబోయే రోజుల్లో యలమంచిలి మండలవ్యాప్తంగా ఉన్న లంకభూములను పేదలకు పంచేవరకూ పోరాడుతాం.

లంకలు గోదావరిలో కలిసిపోతాయి
కానేటి బాలరాజు, సిపిఎం మండల కార్యదర్శి

లంకలను గుల్ల చేసి మట్టిని తరలించడం ద్వారా లంకలు కూడా గోదావరిలో కలిసిపోయే ప్రమాదం ఉంది. మట్టి తవ్వకాలను అధికారులు వెంటనే నిలుపుదల చేయాలి. లేని పక్షంలో గ్రామ ప్రజలను సమీకరించి తామే ఆ మట్టి తవ్వకాలను అడ్డుకుంటాం.

జగనన్న ఇళ్ల లబ్ధిదారులను అప్పులపాల్జేశారు : సిపిఎం

ప్రజాశక్తి - ఉండి

జగనన్న ఇళ్ల లబ్ధిదారులను అప్పులపాల్జేశారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. శనివారం జిల్లాకేంద్రం ఉండిలోని జగనన్న కాలనీ పెదపేట లే అవుట్‌లో సిపిఎం బృందం పర్యటించింది. పునాది దశలోనే నిలిచిన ఇంటి నిర్మాణాలు, పిచ్చి మొక్కలు మొలిచిన లే అవుట్‌లను, మట్టి పూడికలు, రహదారుల్లేని లే అవుట్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం గోపాలన్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు లక్షల ఆర్థికసాయం అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి రాకముందు సిపిఎం ఆధ్వర్యంలో ఉండి బడాబాబుల ఆక్రమణలో ఉన్న బందరుపుంతలో అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నిరసన కార్యక్రమాలు చేపట్టామని, అప్పటి అధికారులు పోలీసులసాయంతో సిపిఎం నాయకులను, నిరుపేదలను అక్రమంగా అరెస్టు చేశారని గుర్తు చేశారు. తర్వాత కాలంలో జగనన్న కాలనీలు నిర్మించేందుకు అన్ని సౌలభ్యాలున్న బందరుపుంతను బడాబాబులకు వదిలేశారన్నారు. నిరుపేదలకు గ్రామ శివారులో సౌకర్యాల్లేని ప్రదేశంలో వ్యవసాయ భూములను కొనుగోలు చేసి రెండేళ్ల క్రితం సుమారు 660 మంది లబ్ధిదారులకు సెంటున్నర చొప్పున ఇచ్చారని, కానీ చాలా చోట్ల పూడికలు చేయకుండా లబ్ధిదారులను ఇల్లు నిర్మించుకోవాలని అధికారులు వాలంటీర్లు బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ ధోరణి వల్ల కొంతమంది లబ్ధిదారులు అప్పులు చేసి పునాదులు వేశారన్నారు. గత వేసవి కాలంలో పునాదులు వేసిన వారు ఇల్లు నిర్మించే సమయంలో వర్షాలు రావడంతో అక్కడ రహదారులు మునిగిపోయి, లోపలికి వెళ్లే మార్గం లేక ఇంటి నిర్మాణాన్ని పునాది దశలోనే ఆపాల్సి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. . అనంతరం సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ మాట్లాడారు. సిపిఎం బృందంలో రామకూరి, వెంకటరత్నం, కడలి నాగేశ్వరరావు ఉన్నారు.

ఎంఎల్ గ్రంధి ఆధ్వర్యాన నియోజకవర్గం అభివృద్ధి

రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భీమవరం నియోజకవర్గంలో అభివృద్ధి వేగవంతంగా జరుగుతోందని రాజ్యసభ సభ్యులు, ఉమ్మడి గోదావరి జిల్లాల పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. శనివారం రాత్రి భీమవరం వచ్చిన ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో కొద్దిసేపు ఎంఎల్ఎ శ్రీనివాస్‌తో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో ఎంఎల్ఎ ఎక్కడా కూడా రాజీపడే పరిస్థితి లేదని పేర్కొన్నారు. అభివద్ధికి చిరునామాగా ఎంఎల్ఎ పనిచేస్తూ, నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందిందని వెల్లడించారు. అర్హులైన ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు నేరుగా అందించేందుకు వాలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ ఘనత దేశంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి మాత్రమే దక్కిందని అన్నారు. జగన్ రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని వెల్లడించారు.



గ్రంధి శ్రీనివాస్ తో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్

ఉత్తమ విద్యే ఎస్‌వికెపి లక్ష్యం

ప్రజాశక్తి - పెనుగొండ

ఉత్తమ విద్యనందించడమే ఎస్‌వికెపి డిగ్రీ అటానమస్ కళాశాల ముఖ్యోద్దేశమని కళాశాల ప్రిన్సిపల్ వైవివి అప్పారావు తెలిపారు. శనివారం కళాశాలలో బోర్డ్ ఆఫ్ స్టడీస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019లో అటానమస్ కళాశాల యాజమాన్యం చొరవతో వచ్చిందన్నారు. అప్పటి నుండి మూడు సంవత్సరాలు పూర్తి చేసుకుని మొదటి బ్యాచ్ గ్రాడ్యుయేషన్ చేసినందుకుగాను సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుంచి హాజరైన అధ్యాపకులతో సిలబస్, మూల్యాంకనానికి సంబంధించి అనేక విషయాలు చర్చించారు. యూనివర్సిటీ నామినీస్, సబ్జెక్ట్ ఎక్స్‌పర్టులు సిలబస్, ప్రశ్నాపత్రాలు, మూల్యాంకనానికి సంబంధించి జాగ్రత్తగా పరిశీలించి తగిన సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అటానమస్ కంట్రోలర్ జి.శ్రీధర్ సిహెచ్.దుర్గాప్రసాద్, రమేష్, ఫణికృష్ణ, సిబ్బందికి తెలియజేశారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ అప్పారావు

కార్మిక, కర్షక ఐక్యతా ర్యాలీని విజయవంతం చేయాలని 14న సదస్సు

ప్రజాశక్తి - భీమవరం

కార్మిక, కర్షక ఐక్యతా ర్యాలీ ఈ నెల 5న ఢిల్లీలో జరగబోతోందని, ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ ఈ నెల 14న జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్ తెలిపారు. ఈ మేరకు శనివారం వారు సంయుక్తంగా ఒక ప్రకటన చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగానే ఏప్రిల్ 5న కార్మిక కర్షక ఐక్యత ర్యాలీని ఢిల్లీలో చేపట్టామని పేర్కొన్నారు. కనీస వేతనాలు, పని భద్రత, మద్దతు ధరకు చట్టం ఇతర అనేక డిమాండ్లతో ఆందోళన జరుగుతుందని తెలిపారు. ఈ నెల 14న నాలుగు సంఘాల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సదస్సు భీమవరం యుటిఎఫ్ హాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సదస్సుకు కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు హాజరుకానున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు సదస్సులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఆదర్శప్రాయులు.. ఏలూరి సోమేశ్వరరావు

నేడు 8వ వర్ధంతి

ప్రభుత్వ ఉద్యోగిగా ఆదర్శవంతమైన సేవలతో, అవినీతిని నిర్భయంగా ఎదిరించిన సాహస కమ్యూనిస్టు నేత ఏలూరి సోమేశ్వరరావు.. తన చిరుప్రాయం నుంచి అనేక ఆర్థిక ఇబ్బందులు, గడ్డు పరిస్థితులు ఎదురైనా చలించక అనేక ఆటుపోట్ల మధ్య చదువు పూర్తిచేసి ప్రభుత్వ దేవస్థానంలో ఉద్యోగంలో చేరారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణంలోని, చేనేత సొసైటీ కాలనీలో ఆయన కుటుంబం నివసించేంది. వారి కుటుంబ వృత్తి.. చేనేత. సోమేశ్వరరావు దేవస్థాన ఉద్యోగిగా ఎక్కడకు బదిలీ అయినా, తమది కమ్యూనిస్టు కుటుంబమని సగర్వంగా చెప్పి మరీ విధుల్లో చేరేవారు. ఆయనకు పాలకొల్లు దగ్గరలోని దొడ్డిపట్ల దేవస్థానానికి బదిలీ అయిన సందర్భంలో బాధ్యతలు స్వీకరించే ముందు, తమది కమ్యూనిస్టు కుటుంబమని ప్రకటించి తన నిజాయితీని రుజువు చేసుకున్నారు. అలాగే శివదేవుని చిక్కాల గ్రామ దేవస్థానంలో పనిచేసిన సందర్భంలోనూ ఇదే విధంగా వ్యవహరించారు. ఆ గ్రామంలోని పెద్దమనిషి దేవస్థానంలో ఒక అక్రమ పని చేస్తే మంచి బహుమతి ఇస్తామని ప్రలోభానికి గురిచేసిన సందర్భంలో తనకు తప్పుడు పనులు తెలియవని చాలా కఠినంగా చెప్పిన ఆదర్శ ఉద్యోగి సోమేశ్వరరావు. అలాగే మరో దేవస్థానంలో ఒక వ్యక్తి తనకు అనుకూలంగా ఒక మాట చెప్పమని, ఒక క్యాన్ నిండా తాజా వెన్నపూస తెచ్చి ఇస్తే అతనిపై మండిపడి తీవ్రంగా గద్దించారు. ఈ రెండు ఘటనలు ఉదాహరణకు మాత్రమే. ఇంకా సోమేశ్వరరావు ఉద్యోగ నిర్వహణలో ఎన్నెన్నో ఆదర్శ సంఘటనలున్నాయి.

దశాబ్దకాలం పాటు తన ఆరోగ్యం చెడిపోయి, పార్టీకి సేవ చేయలేని సందర్భంలో తన భార్య సీతను పార్టీకి సేవ చేయాలని ప్రోత్సహించారు. పాలకొల్లు పట్టణం పంచారామల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. ఈ ప్రాంతంలో చేనేత పరిశ్రమ అతిపెద్దది. చేనేత సొసైటీ, చేనేత కార్మిక సంఘం చాలా బలంగా ఉండేది. పట్టణం చుట్టూ ఉన్న గ్రామాల్లో కూడా చేనేత సొసైటీలు బాగా పనిచేసేవి. మెజారిటీ పార్టీ కుటుంబాలు, కమ్యూనిస్టు కుటుంబాలు. 1948-52 సంవత్సరాల్లో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన వీర తెలంగాణ ప్రజాపోరాటం కాలంలో అజ్ఞాతంలో ఉన్న కమ్యూనిస్టు పార్టీ నాయకులకు, ప్రధానంగా, పాలకొల్లు చేనేత కుటుంబాలు ప్రాణాలకు తెగించి, కమ్యూనిస్టు పార్టీ నాయకులకు రక్షణగా నిలిచాయి. చేనేత కుటుంబాల్లోని స్త్రీలు ముఖ్యంగా సోమేశ్వరరావు తల్లి వెంకటరత్నం, బాసిన వెంకటరత్నం, సత్యం తల్లి నూకమ్మ, అయిరెడ్డి చాయమ్మ, తదితర మాతృమూర్తులు కన్న తల్లుల మాదిరి భోజనాలు పెట్టి రహస్యంగా కాపాడారు. సోమేశ్వరరావు తండ్రి ఏలూరి సత్యం పాలకొల్లు చేనేత సొసైటీలో, గుమస్తాగా ఉద్యోగం చేస్తూ, చేనేత సంఘానికి, కమ్యూనిస్టు పార్టీకి సేవలందిస్తూ సొసైటీ డైరెక్టర్‌గా పనిచేశారు. ఈ నాటికీ 92 సంవత్సరాల వృద్ధాప్యంలో కూడా పార్టీ కార్యక్రమాలే తనకు బలాన్నిస్తాయి అంటూ కమ్యూనిస్టు నేత యర్రా కృష్ణారావు, అమరులు మానం నరసింహమూర్తి, చల్లా కోటిలింగం, తూతిక మావుళ్లయ్య తదితరులు సొసైటీ డైరెక్టర్లుగా ఉండేవారు. సోమేశ్వరరావు తండ్రి ఆంధ్రప్రదేశ్ చేనేత ఆప్కో బోర్డు రాష్ట్ర ఎన్నికల్లో పశ్చిమ గోదావరి జిల్లా తరపున పోటీ చేసి ఘన విజయం సాధించారు. పాలకొల్లులోని చేనేత సంఘమే కమ్యూనిస్టు పార్టీకి బలమైన ఆయుధంగా పనిచేసేది. తల్లిదండ్రుల వారసత్వంతో ఈ దోపిడీ వ్యవస్థను ఎదిరించి ఉద్యోగ ధర్మం నిర్వహించిన ధన్యజీవి సోమేశ్వరరావు.

1964-66 సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీ నాయకులను, మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య సహా కేంద్రప్రభుత్వం డిటెన్షన్ చట్టం కింద అరెస్టు చేసి జైళ్లలో నిర్బంధించిన సందర్భంలో అల్లూరి సత్యనారాయణ, ఆర్‌ఎస్ కూడా డిటెన్షన్ చట్టానికి గురయ్యారు. పాలకొల్లు చేనేత కాలనీలోని ఆయన ఇంట్లో ముగ్గురు చిన్న పిల్లలతో ఒంటరిగా ఏ రక్షణా లేని తాటాకు ఇంట్లో ఉండేవారు. కాలనీలో ఉన్న చేనేత కుటుంబాలు తనను వెయ్యి కళ్లతో కాపాడారు. ఏలూరి సత్యం కొడుకు సోమేశ్వరరావు, చల్లా కోటిలింగం కొడుకు వీరభద్రరావు ఇద్దరూ సాయంత్రం స్కూలు నుంచి ఇంటికి వచ్చి చదువుకుని, తనకూ, పిల్లలకూ తోడుగా పడుకునేవారు. చిన్న వయసులో ఆ ఇద్దరూ సహాయంగా ఉండేవారు. ఆ రోజుల్లో ఆ ప్లిలల సహాయం మరువలేనిది. ఆ కష్టకాలంలో వారి ఆదరణ, వారి సామాజిక చైతన్యం వివరించలేనిది.

సోమేశ్వరరావు గుండె జబ్బుతో పోరాడుతూనే ధైర్యంగా చివరివరకూ, తన ఉద్యోగధర్మం నిర్వహించారు. తన నలుగురు పిల్లలకు, తల్లిదండ్రుల వైపు బంధువులకు, సమసమాజం కోసం పాటుపడే సిపిఎంకు సహాయ, సహకారాలు అందించారు. 2015 ఫిబ్రవరి 12వ తేదీన ఆయన సతీమణి సీతకు, తన దగ్గరున్న అందరికీ సెలవు చెప్పి కన్నుమూశారు. అతని వ్యక్తిత్వం చిన్ననాటి నుంచి అనేక కష్టాల జీవనయాత్రలో ఎన్ని పరీక్షలు ఎదురైనా ఏనాడూ తను నమిన్న ఆశయాన్ని వదల్లేదు. నిండైన మంచి మనసుతో అందరినీ ఆదరించి చివరివరకూ సామాజిక స్ఫూర్తితోనే కన్నుమూసిన ధన్యజీవి సోమేశ్వరరావు. 14 సంవత్సరాలపాటు భర్త ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపి, అహర్నిశలు వెయ్యికళ్లతో గమనిస్తూ భార్య సీత వైద్యం చేయించారు. ఒకవైపు భర్త, పెద్ద వయసులో మంచంపై నుంచి లేవలేని అత్తను చూసుకుంటూ అందరికీ ఆధారమైన సతీపాత్ర అద్భుతం. అందరికీ ఆదర్శం. ఆ ఆదర్శ దంపతులకు నలుగురు బిడ్డలు.

నేడు ఎనిమిదో వర్ధంతి

ఈనెల 12వ తేదీన సోమేశ్వరరావు ఎనిమిదో వర్ధంతి. ఈ సందర్భంగా ఆయన ఆశయాలు, నీతి, నిజాయితీ అందరికీ ఆదర్శప్రాయం.

- అల్లూరి మన్మోహిని


మాతృభాషలోనే ప్రాథమిక విద్య ఉండాలి

దేశ సంస్కృతీ, సాంప్రదాయాలను యువత, విద్యార్థులు కాపాడాలి
భీమవరం పర్యటనలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి - భీమవరం

ప్రపంచంలో ఎన్ని భాషలున్నా.. వాటికి ఎంత ప్రాధాన్యత ఉన్నా ప్రాథమిక విద్య మాత్రం మాతృభాషలోనే ఉండాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. మాతృభాష, కన్నతల్లి, జన్మభూమిని మరిచిన వాడు మానవుడే కాదని అభిప్రాయపడ్డారు. దేశం శాస్త్ర, సాంకేతికరంగంలో ముందుకు దూసుకెళ్తోం దన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయం, పురాతన విజ్ఞానాన్ని విద్యార్థులు, యువత పెంచుకోవాలని సూచించారు. శనివారం పశ్చిమగోదావరి జిల్లా పర్యటనకు వచ్చిన వెంకయ్యనాయుడు ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల 43వ వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంగ్లీషు, హిందీ భాషలకు తాను వ్యతిరేకిని కానని ప్రాథమిక విద్య మాతృ భాషలోనే ఉంటేనే విద్యపై పట్టు రావడంతో పాటు పాఠ్యాంశాలు అర్థవంతంగా ఉంటాయన్నారు. సాంకేతిక కోర్సులను కూడా మాతృభాషలో పెట్టాలని ఆ విధంగా ఇప్పుడిప్పుడే అడుగులు పడుతున్నాయని చెప్పారు. భారతీ యత, నడవడిక, ఓర్పు, నేర్పు, ఆట, పాట, భాష, యాస, ప్రాస భారతీయ జీవన విధానంలో భాగమన్నారు. పట్టణాలు రోజురోజుకీ అభివృద్ధి చెందుతున్నాయని, గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వాలు ఏదో చేస్తాయని చూడకుండా అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు దేశంలో ఎంతో ప్రత్యేకత ఉందన్నారు.

పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్ర మోడీ యోగా కోసం పార్లమెంట్‌లో తీర్మానం పెడితే 172 దేశాలు ఆమోదించాయన్నారు. అలాగే ప్రకృతితో ప్రేమగా ఉండాలన్నారు. ప్రతిఒక్కరు మొక్కలను నాటాలన్నారు. తొలుత సాగిరాజు రామకృష్ణంరాజు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐడియా ల్యాబ్‌ను వెంకయ్యనాయుడు ప్రారంభించి పలు విభాగాలను పరిశీలించారు. అనంతరం కళాశాలలో వివిధ విభాగాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్‌ను వెంకయ్యనాయుడు అందజేశారు. అంతరం కళాశాల యాజమాన్యం వెంకయ్యనాయుడుని ఘనంగా సత్కరించింది. శాసనాలను రూపొందించి వాటిని అమలు చేయడంలో ప్రధాన భూమిక పోషిస్తున్న పార్లమెంట్‌లో, అసెంబ్లీలో కొంతమంది గందరగోళం సృష్టించడం బాధాకరమని వెంకయ్య నాయుడు అన్నారు. దేవాలయాలుగా భావించాల్సిన అలాంటి ప్రాంతాల్లో కగితాలు చించి పారేయడం, బెంచీలు ఎక్కడం దారుణమైన భావజాలమన్నారు. అలాంటి వాటికి పాల్పడుతున్న వారిని దూరంగా పెట్టాలన్నారు.



మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు

రాజధానిపై స్పష్టత ఇవ్వాలి

ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులతో ముచ్చటిస్తున్న సందర్భంలో కళాశాలలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న పావని వెంకయ్యనాయుడుపై ప్రశ్నల వర్షం కురిపించింది. రాష్ట్రానికి రాజధాని అమరావతా, విశాఖపట్నమా చెప్పాలని కోరింది. దీనిపై స్పందించిన ఆయన తన అభిప్రాయాన్ని అనాడే చెప్పానని, ఉపరాష్ట్రపతి అయిన తర్వాత రాజకీయ అంశాలపై మాట్లాడలేదని బదులిచ్చారు. దీంతో ఆ విద్యార్థి రాజధాని అనేది తమ భవిష్యత్ అని తమరు అలా అంటే ఎలా సార్ అని అన్నారు. తాను కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిగా ఉన్న సమయంలో అమరావతికి నిధులు కూడా కేటాయించాలని చెప్పానని, దీన్ని బట్టి నువ్వే అర్థం చేసుకోవాలని నవ్వుతూ బదిలిచారు. అనంతరం మరికొంతమంది విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు.

అల్లూరి జీవితాన్ని పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

మన్యం ప్రజలను సంఘటితం చేసి స్వతంత్ర్య పోరాటం వైపు నడిపించిన యోధుడు అల్లూరి సీతారామరాజు జీవితాన్ని పాఠ్య పుస్తకాల్లో పొందుపరచాలని వెంకయ్యనాయుడు అన్నారు. భీమవరంలో అల్లూరి కాంస్య విగ్రహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఎన్నిక

అధ్యక్షులుగా వాసు, కార్యదర్శిగా పెద్దిరాజు

ప్రజాశక్తి - భీమవరం

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభ శనివారంతో ముగిసింది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి హాజరైన ప్రతినిధులు వారి మండలాల్లో చేసిన కార్యక్రమాల నివేదికను మహాసభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.ధనుష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కేంద్రీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణ విధానాలతో దేశంలో విద్యా వ్యవస్థను నాశనం చేస్తోందన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బడ్జెట్ నిరుద్యోగులకు నిరాశ మిగిల్చిందన్నారు. జిల్లాలో డ్రగ్ సంస్కృతికి వ్యతిరేకంగా విద్యార్థి, యువకుల ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

నూతన కమిటీ ఎన్నిక

23 మంది సభ్యులతో ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షులుగా పి.వాసు, జిల్లా కార్యదర్శిగా డి.పెద్దిరాజు ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా టి.ప్రసాద్, ఎండి.జాన్, సహాయ కార్యదర్శిగా ఎం.మనోజ్, కె.మణికంఠ ఎన్నుకున్నారు. మరో 17 మంది కమిటీ సభ్యులును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యదర్శి పెద్దిరాజు మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లలో సమస్యలపై జిల్లా వ్యాప్తంగా పోరాటం చేస్తామన్నారు. ప్రత్యేక హోదా కోసం పోరాటం కొనసాగిస్తామన్నారు. భీమవరంలో నన్నయ యూనివర్సిటీ అనుబంధ పీజీ సెంటర్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు విస్తృతంగా సదస్సుల సెమినార్లు నిర్వహించాలని పిలిపునిచ్చారు. ఈ మహాసభలో జిల్లా కమిటీ సభ్యులు వి.భానుప్రకాశ్, నరసింహ, పి.సాగర్, లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.



అధ్యక్షులు పి.వాసు



కార్యదర్శి డి.పెద్దిరాజు

సమస్యల పరిష్కారానికి కృషి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - పోడూరు

పోడూరులో పూజారి వారిగరువులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీ రంగనాథరాజు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను రంగనాథరాజు దృష్టికి తీసుకొచ్చారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ అనంతరం ఆయన మాట్లడుతూ పేదల అభివృద్ధికి, సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి శెట్టిబత్తుల సువర్ణరాజు, ఎంపిపి శబ్బితి సుమంగళి, జెడ్‌పిటిసి గుంటూరు పెద్దిరాజు, వైస్ ఎంపిపి రుద్రరాజు సీతారామరాజు, ఎంపిటిసి పొడురి నాగరాజు, సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుముడి రామచంద్రరావు, తహశీల్దార్ ఆర్‌వి కృష్ణారావు, ఆర్ఐ రాంబాబు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు

శాంతి భద్రతలను పరిరక్షించాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పోలీసులు శాంతిభద్రతలను పరిరక్షించాలని, అదే సమయంలో ప్రజలతో ఫ్రెండ్లీ పోలీస్‌గా ఉండాలని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ భీమవరం రూరల్ ఎస్ఐ మోహన్‌రావును ఆదేశించారు. భీమవరం ట్రాఫిక్ ఎస్ఐగా పనిచేసిన మోహన్ రావు ఇటీవల భీమవరం రూరల్ ఎస్ఐగా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎస్ఐ ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు



ఎంఎల్ఎను కలిసిన ఎస్ఐ మోహన్‌రావు

అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - పెనుగొండ

ఈ నెల 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ పశ్చిమ బెంగాల్ హౌరాలో జరుగుతున్న అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం 10వ మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు షేక్ పాదుషా పిలుపునిచ్చారు. ఈ మహాసభల ప్రారంభ సూచికంగా పెనుగొండలోని దొంగగూడెంలో సంఘ పతాకాన్ని సంఘం మండల కార్యదర్శి పూతునీడి పద్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, పాదుషా మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఉపాధి హామీకి నిధులను గత సంవత్సరం కంటే రూ.29 వేల కోట్లు కోత విధించిందన్నారు. 2019 - 20 బడ్జెట్లో రూ.లక్షా పదివేల కోట్లు ఉంటే నేడు కేవలం రూ.60,000 కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. మోడీ బడ్జెట్లో సంపన్నులకు వరాలు సామాన్యులపై భారాలు వేసినట్టుగా ఉందని విమర్శించారు ఇప్పటికైనా జిల్లా, మండల అధికారులు పనులు అడిగిన కూలీలకు పనులు కల్పించాలని, కనీస వేతనం రూ.600 ఇవ్వాలని కోరారు ఈ కార్యక్రమంలో పి.విష్ణుమూర్తి, కుడిపూడి విజయ, పి.సత్య భవాని, పి.లక్ష్మి పాల్గొన్నారు.



ఎంఎల్‌సికి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - పోడూరు

పోడూరులో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్, నేత బొంతు శ్రీనివాస్ శాసనసభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో కమ్మురి కుంట, దాసరిపేట, పెదపేటకు సంబంధించిన శ్మశానవాటికకు దారిలేకపోవడం వల్ల మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి బోదెకు వంతెన ఏర్పాటు చేసి దారి ఏర్పాటు చేయాలని కోరారు. చంద్రరావుచెరువు వాడకం నీరు బయటకెళ్లేందుకు డ్రెయినేజీ ఏర్పాటు చేయాలన్నారు. చెరువు వద్ద కాలనీకి దారిలేక ప్రజలు ఇళ్ల నిర్మాణానికి, సరుకులు తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సినిమా హాల్ నుంచి గర్వు వరకూ ఉన్న కెనాల్ సీసీ రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కోరారు. విద్యుత్ దీపాలు లేకపోవడం వల్ల రాత్రి సమయంలో తిరుగుతుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురౌతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి కాకర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సదాశివమూర్తికి సత్కారం

ప్రజాశక్తి - పాలకొల్లు

మనిషి అవయవాలు కోల్పోయినా మానసిక ధైర్యంతో బతకాలని నేర్పిన డాక్టర్ సదాశివమూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని పాలకొల్లు ఛాంబర్ అధ్యక్షులు కారుమూరి నరసింహారావు తెలిపారు. ఛాంబర్ డిగ్రీ కళాశాలలో శనివారం జెసిఐ పాలకొల్లు క్రికెట్ సంస్థ ఆధ్వర్యంలో జీవిత గ్రేట్ ఆఫ్ ఇండియా అవార్డు గ్రహీత, ప్రతిష్టాత్మక కామన్వెల్త్ యూనివర్సిటీ కింగ్డాం ఆఫ్ టోంగా ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో పిహెచ్‌డి పట్టా అందుకున్న వేదాంతం సదాశివ మూర్తిని అభినందించారు. కార్యక్రమానికి సంస్థ అధ్యక్షులు కావలి మాని అధ్యక్షత వహించారు. అనంతరం సదాశివమూర్తి, సుందరి దంపతులను జెసిఐ సభ్యులు, ప్రముఖులు చేగొండి సూరిబాబు, బోణం రాంబాబు, కారుమూరి శ్రీరాములు, చల్లా ఉమాశర్మ, డా. చల్లా మాధుర్ ఘనంగా సత్కరించారు. జెసిఐ ప్రతినిధులు రాహుల్, మనోజ్ విష్ణు సత్కరించారు.



మాట్లాడుతున్న వావిలాల సరళాదేవి

ఘంటసాలకు నివాళి

ప్రజాశక్తి - తణుకు

ప్రముఖ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 49వ వర్ధంతిని విగ్రహ దాత వావిలాల సరళాదేవి వెంకటరమేష్ దంపతుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ పార్కు వద్ద ఉన్న గంటసాల విగ్రహానికి సరళా దేవి దంపతులు, అభిమానులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సరళాదేవి మాట్లాడుతూ గంటసాల జీవిత చరిత్ర నేటి యువతరం గాయకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చెప్పాడ నాగేశ్వరరావు, ఆర్కెస్ట్రా రాజు, పెరవలి రామకృష్ణ తేటల సాయి ఆకురాతి శ్రీనివాస్ నక్కా సుబ్బారావు పాలింగి రామారావు కామేష్ పాల్గొన్నారు.

టిడిపి సీనియర్ నేత కృష్ణమూర్తి మృతి

ప్రజాశక్తి - వీరవాసరం

టిడిపి సీనియర్ నేత గొర్రె కృష్ణమూర్తి (76) శనివారం మృతి చెందారు. టిడిపి ఆవిర్భావం నుంచి ఆయన చనిపోమే వరకూ పార్టీ పట్ల అంకిత భావంతో పని చేశారు. ప్రస్తుతం ఆయన పార్టీ వీరవాసరం గ్రామ కార్యదర్శిగా పని చేస్తున్నారు. గతంలో దేవస్థానం ఛైర్మన్‌గా, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఛైర్మన్‌గా, భీమవరం నియోజవర్గ సమన్వయ కమిటీ సభ్యుడిగా పని చేశారు. గత కొద్ది రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల సిపిఎం సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, బాలం విజయకుమార్, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, జనసేన మండల అధ్యక్షుడు గుండా రామకృష్ణ, వీరవాసరం వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, టిడిపి నాయకులు రాయపల్లి వెంకట్, వీరవాసరం సర్పంచి చికిలే మంగతాయారు సంతాపం వ్యక్తం చేశారు.

నత్తారామేశ్వరంలో మహాశివరాత్రికి ఏర్పాట్లు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మహాశివరాత్రి సందర్భంగా నత్తారామేశ్వరంలోని రామేశ్వరస్వామి వారి కళ్యాణం ఈ నెల 18వ తేదీన నిర్వహించడం జరుగుతుందని దేవస్థానం ఇన్‌ఛార్జి కార్య నిర్వహణ అధికారి వై.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళ్యాణానికి దూర ప్రాంతాల నుండి వచ్చే యాత్రికులకు ఎటువంటి అసౌకర్యమూ లేకుండా పారిశుధ్య పనులు మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. ముఖ్యంగా యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా దాతల సహకారంతో తాగునీరు, పులిహోర, పిల్లలకు అవసరమైన పాలు సమృద్ధిగా యాత్రికులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. సుమారు 25 వేల మంది యాత్రికులు స్వామిని దర్శించుకోవడానికి వస్తారని అంచనా వేశారని తెలిపారు. ఆలయ ప్రాంగణంలో భారీ ఎత్తున అన్న సమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.



పాలకొల్లులో నిర్వహించిన లోక్ అదాలత్

లోక్ అదాలత్‌లో 528 కేసుల పరిష్కారం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో మొత్తం 528 కేసులు రాజీచేశారు. పాలకొల్లు న్యాయస్థానాల సముదాయంలో 2 బెంచెలుగా ఏర్పడి ఒక బెంచ్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉషా లక్ష్మీ కుమారి, రెండో బెంచ్‌లో పి.భాను సాయి పరిష్కరించుకున్న కేసుల్లో అవార్డులు జారీ చేశారు. పాలకొల్లు టౌన్, రూరల్, పోడూరు, ఆచంట, సిఐ, పోలీసు సిబ్బంది సీనియర్, జూనియర్ న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు. వాదించుకుంటే ఎవరో ఒకరే గెలుస్తారని చర్చించుకుంటే సమస్య పరిష్కరించుకుని ఇరువురు అంగీకార యోగ్యమైన తీర్పును పొందవచ్చుననే ఉద్దేశంతో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు న్యాయ సేవాధికార సంస్థలను ఏర్పాటు చేసి తద్వారా ప్రతి ఒక్కరికి న్యాయం అందాలనే ఉద్దేశంతో లోక్ అదాలత్‌లను స్థాపించారు.

పెదఅమిరంలో మురుగుకాలువ ప్రక్షాళన పనులు

ప్రజాశక్తి - కాళ్ల

పెదఅమిరం గ్రామ పంచాయతీలో మురుగు కాలువ ప్రక్షాళన పనులు చేస్తున్నామని సర్పంచి డొక్కు సోమేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో మురుగు కాలువ అభివృద్ధి పనులను పంచాయతీ నిధులు రూ.3 లక్షలతో రెండు కిలోమీటర్ల పొడవున చేపడుతున్నామన్నారు. ఇళ్లలోని వాడకపు నీరు మురుగు కాలువలోకి వస్తుందన్నారు. కోనేరు నుంచి జువ్వలపాలెం మెయిన్ ఆర్అండ్‌బి రోడ్డు వరకూ మురుగు కాలువ ప్లాస్టిక్ వ్యర్థాలు మట్టితో పూడుకుపోయిందని, మురుగునీరు దిగువకు వెళ్లడం లేదని తెలిపారు. మురుగు కాలువకు ఇరువైపులా చెట్లు ఏపుగా పెరిగాయని, మురుగు కాలువకు అడ్డుగా ఉన్న చెట్లను, ప్లాస్టిక్ వ్యర్థాలను తవ్వి పల్లపు ప్రాంతాల్లో వేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచి జవ్వాది కిషోర్, గ్రామ కార్యదర్శి పి.కనకరావు, 9వ వార్డు సభ్యులు అలుగు చిన్న, 3వ వార్డు సభ్యులు ఆరేపల్లి పరమేశ్వరరావు పాల్గొన్నారు.



పెదఅమిరంలో పొక్లెయినర్‌తో మురుగుకాలువ ప్రక్షాళన పనులు చేపడుతున్న సర్పంచి


ధన్యజీవి నరసింహమూర్తి

ప్రజాశక్తి - నరసాపురం

సిపిఎం సీనియర్ నాయకులు గుడూరు నరసింహమూర్తి ధన్యజీవి అని పార్టీ జిల్లా కార్యదర్శి సభ్యులు కవురు పెద్దిరాజు తెలిపారు. మల్లవరంలో గూడూరు నరసింహమూర్తి సంస్మరణ సభ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ముచ్చర్ల త్రిమూర్తులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కవురు పెద్దిరాజు మాట్లాడుతూ గూడూరు నరసింహమూర్తి వ్యవసాయ కుటుంబంలో పుట్టి కమ్యూనిస్టు సభ్యుడిగా అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. మల్లవరం గ్రామ పంచాయతీ బోర్డు మెంబర్‌గా సొసైటీ బోర్డు మెంబర్‌గా పనిచేశారని తెలిపారు. పార్టీ ఇచ్చే అనేక ప్రజా ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించిన నరసింహమూర్తి మరణం సిపిఎం పార్టీకి తీరని లోటు అని కొనియాడారు. సిపిఎం సభ్యుడిగా క్రమశిక్షణ కలిగిన జీవన విధానాన్ని అలవర్చుకుని పార్టీ, ప్రజా కోసం తుది శ్వాస విడిచే వరకూ పనిచేసిన నరసింహమూర్తి ధన్యజీవిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు పిల్లి.కామేశ్వరరావు, నాయుకులు కాకిలేటి ప్రసాద్, పాల రాఘవులు, కడలి ఆంజనేయులు, చిట్టిబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కవురు పెద్దిరాజు



పెర్కిపాలెంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం

పెర్కిపాలెంలో వైద్యశిబిరం

ప్రజాశక్తి - వీరవాసరం

పెర్కిపాలెంలో విషజ్వరాలు విజృంభించి పలువురు గ్రామస్తులు ఆసుపత్రిపాలవ్వడంతో సిపిఎం డిమాండ్ మేరకు శనివారం ఆ గ్రామంలో వీరవాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గత నెల రోజులుగా గ్రామంలో విషజ్వరాలబారిన పడి పలువురు ఆసుపత్రిలో చేరి వైద్య పొందినట్టు తెలిపారు. గ్రామంలో అంతర్గ డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యవస్థంగా తయారవ్వడంతో దోమలు విజృంభిస్తున్నాయని గ్రామస్తులు పత్ర దయాకుమార్, నీళకంఠం తెలిపారు. తాము ఇరవై రోజుల క్రితం విషజ్వరాల బారిన పడి ప్రయివేటు ఆసుపత్రిలో వైద్యం పొందినట్టు తెలిపారు. ప్రభుత్వ వైద్యంపై అవగాహనలేని పలువురు ప్రయివేటు డాక్టర్‌ను సంప్రదించి అధిక ఖర్చుతో వైద్యం పొందుతున్నట్టు తెలుస్తోంది. గ్రామంలో ఉన్న పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని సర్పంచి కందుల వెంకటేశ్వరావు గ్రామంలో దోమల నివారణ చర్యలు చేపట్టారు. గ్రామంలో మలేరియా లేదని హెల్త్ సూపర్‌వైజర్ జివివి. సత్యనారాయణ తెలిపారు. ఈ శిబిరంలో 37 మందికి వైద్యపరీక్షలు చేశామన్నారు. కొంత మందికి సాధారణ దగ్గు, జలుబు ఉన్నట్టు గుర్తించామన్నారు. అవసరమైన వారికి మందులు అందజేయడం జరిగిందన్నారు. రెండో రోజు కూడా ఇంటింటికి సర్వే చేయడం జరుగుతుందన్నారు. శిబిరంలో హెల్త్ అసిస్టెంట్ చిట్టిబాబు, భారతి, ఎఎన్ఎం జనమణి, ఆశ, హెల్ వర్కర్లు పాల్గొన్నారు.

నక్కావారిపేటలో 'రాష్ట్రానికి ఇదేం ఖర్మ'

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రజలు చంద్రబాబునాయుడు పాలన కోరుకుంటున్నారని పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. మొగల్తూరు పంచాయతీ నక్కావారి పేటలో పార్టీ మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిబంధనల పేరుతో పలువురు లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందకుండా చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కత్తిమండ ముత్యాలరావు, కలిదిండి కుమార్‌బాబు, మామిడిశెట్టి సత్యనారాయణ, పాలా రాంబాబు, వెలిది పుల్లారావు ఉన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నేతలు



కుమార్‌కు బండి అందజేస్తున్న యడ్ల తాతాజీ

తాతాజీ దాతృత్వం

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని 25వ వార్డుకు చెందిన కండిపల్లి చిన్న కుమారుడు కుమార్‌కు ఇచ్చిన మాట ప్రకారం జీవనోపాధి నిమిత్తం డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ శనివారం తోపుడు బండిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగన్ తనకు స్ఫూర్తి అని తెలిపారు. పాలకొల్లు ధన్య భూమి అని, ఇక్కడ పుట్టిన వారు చాలా మంది తమ ఆస్తులు సైతం లెక్కజేయకుండా సేవా కార్యక్రమాలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చోడదాసి అశోక్‌కుమార్, జోగాడ ఉమామహేశ్వరరావు, జోగి వడ్డీకాసులు పాల్గొన్నారు.

హరిబాబుకు అంగర పరామర్శ

ప్రజాశక్తి - పాలకొల్లు

ఎపి పాలకొల్లు ఎన్‌జిఒ అధ్యక్షుడు, లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబుకు ఇటీవల హైదరాబాద్ స్టార్ హాస్పిటల్లో బైపాస్ సర్జరీ చేశారు. విషయం తెలుసుకున్న ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ శనివారం పాలకొల్లులో హరిబాబును పరామర్శించారు. హరిబాబు కోలుకుని మరిన్ని సేవలందించాలన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సిఐ ఆంజనేయులు

చోరీ కేసులో ఇద్దరు బాల నేరస్తుల అరెస్టు

ఒకరు పరారీ - 40 మద్యం సీసాలు, మోటార్ సైకిల్ స్వాధీనం

ప్రజాశక్తి - తణుకురూరల్

తణుకు రూరల్ ప్రాంతంలో చోరీలకు పాల్పడిన అంతర్ జిల్లా బాల నేరస్తులను రూరల్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. నిందితుల నుంచిమారు రూ.లక్షా 10 వేల రూపాయల విలువైన బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్, పలు కంపెనీలకు చెందిన 40 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. తణుకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను సిఐ సిహెచ్ ఆంజనేయులు వెల్లడించారు. అంతర్ జిల్లా బాల నేరస్తులు మొదట చిన్న చిన్న కిళ్లీ కొట్లు, దేవాలయాల డిబ్బీలు దొంగతనం చేయడం మొదలు పెట్టారని, తరువాత మోటార్ సైకిళ్లు చోరీ చేస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలోనే డిసెంబర్ 29న అర్ధరాత్రి 2.30గంటల సమయంలో నలుగురు బాల నేరస్తులు రెండు మోటార్ సైకిళ్లపై మండపాక గ్రామం శివారున గల ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద కాపలాగా ఉన్న వాచ్‌మెన్‌ను కొట్టి, చంపేస్తామని బెదిరించి, షాపు తలుపులు బద్దలు కొట్టి 90 మద్యం సీసాలను దొంగిలించారని తెలిపారు. జనవరి 26న మండపాక రైల్వే గేటు దగ్గర బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్‌ను దొంగిలించారన్నారు. బైపాస్ రోడ్డులో దాచిన మద్యాన్ని తీసుకోవడానికి వెళ్లతున్నారన్న సమాచారంపై ముగ్గురు బాల నేరస్తులను శనివారం అరెస్టు చేసినట్లు తెలిపారు. ఏలూరు జువైనైల్ జస్టిస్ బోర్డులో వారిని హాజరుపరుస్తానన్నారు. మరో బాల నేరస్తుడు పరారీలో ఉన్నాడన్నారు. వీరి పై గతంలో పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 15 కేసులు ఉన్నాయన్నారు. కోనసీమ జిల్లాలో రాజోలు, కాకినాడ జిల్లాలో గండెపల్లి, గుంటూరు జిల్లా తాడేపల్లి పోలీసుస్టేషన్ లో పలు కేసులు ఉన్నాయన్నారు. నిందితులను అరెస్టు చేసిన తణుకు రూరల్ సిఐ ఆంజనేయులు, తణుకు రూరల్ ఎస్ఐ కె.గుర్రయ్య, హెడ్ కానిస్టేబుల్ కె సుబ్బారావు, కానిస్టేబుళ్లను ఎస్‌పి అభినందించారు.

పాలకొల్లులో షార్ట్ ఫిల్మ్ 'మహాసు' ఆవిష్కరణ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఆదిత్య కళాశాలలో పూర్వ విద్యార్థి పామర్తి పవన్ తేజ తీసిన షార్ట్ ఫిల్మ్ 'మహాసు ను ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు కళాశాలలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ పాలకొల్లు పేరు చెబితే దర్శకులు దాసరి నారాయణరావు, కోడి రామకృష్ణ, నటుడు అల్లు రామలింగయ్య, చలం, పినిశెట్టి శ్రీరామ్మూర్తి, చేగొండి అనంత శ్రీరామ్ వంటి ఎందరో పేరు ప్రఖ్యాతలు సాధించిన వారి పేర్లు గుర్తుకొస్తాయన్నారు. ప్రస్తుతం షార్ట్ ఫిల్మ్ కూడా పామర్తి పవన్ తేజ వంటి యువకులు మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని చెప్పారు. ఈ సందర్భంగా పవన్ తేజ షార్ట్ ఫిల్మ్ విజయం సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య సంస్థల డైరెక్టర్ ఎస్‌వి రాఘవరెడ్డి, పవన్ తేజ తండ్రి సీనియర్ న్యాయవాది పామర్తి నగేష్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు తలుపుల శ్రీనివాస్, చేగొండి సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.



పాలకొల్లులో షార్ట్ ఫిల్మ్ ఆవిష్కరించిన నిమ్మల రామానాయుడు

జుత్తిగలో మావుళ్లమ్మ ఉత్సవం

ప్రజాశక్తి - పెనుమంట్ర

సంతానం లేనివారు, పెళ్లికాని వారు బోనాలు ఎత్తుకోవడం వల్ల ఫలితం ఉంటుందని జుత్తిగ మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానం నిర్వాహకులు తమనంపూడి వీరెడ్డి అన్నారు. శనివారం జుత్తిగ గ్రామ శివారు ప్రాంతంలో వెలసిన మావుళ్లమ్మ దేవస్థానం 17వ వార్షికోత్సవం సందర్భంగా మొక్కులు తీర్చుకోవడానికి వచ్చిన 80 మంది యాత్రికులు బోనాలు ఎత్తుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ యాత్రికులకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ నెల 12వ తేదీ అమ్మవారికి నిత్యార్చన సందర్భంగా మహా అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న బస్సు

తప్పిన పెనుప్రమాదం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం పట్టణంలో శనివారం తృటిలో ఘోర ప్రమాదం తటిలో తప్పింది. భీమవరం ఆర్‌టిసి డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు తాడేపల్లిగూడెం నుంచి గణపవరం మీదుగా భీమవరం వస్తోంది. ఈ బస్సు భీమవరం రెండో పట్టణం ఉండి రోడ్డులో పుష్ప పెట్రోల్ బంక్ వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని ఆగింది. పెట్రోల్ బంక్ లోపలికి బస్సు చొచ్చుకెళ్లి ఉంటే ఘోరప్రమాదం సంభవించేది. ముప్పు తప్పడంతో ప్రయాణికులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. బస్సు డ్రైవర్ వెంటనే అధికారులకు సమాచారం అందించారు. ప్రమాదానికి కారణం తెలియాల్సి ఉంది.

కొబ్బరి చెట్టు విరిగిపడి వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - పెనుగొండ

కొబ్బరి చెట్టు మీదపడి వ్యక్తి గాయపడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ములపర్రు శివారు పితానివారిపాలెం గ్రామానికి చెందిన గుత్తుల శ్రీనివాసరావు పాలుపోయడానికి సైకిల్‌పై ములపర్రులోని పాలకేంద్రానికి వెళ్లాడు. పాలు వేసి తిరిగి వస్తుండగా పితానివారిపాలెం వద్ద ఆచంట - సిద్ధాంతం ఆర్ అండ్ బి రోడ్డు పక్కన ఉన్న కొబ్బరి చెట్టు విరిగి అతనిపై పడింది. దీంతో తీవ్ర గాయాలపాలైన శ్రీనివాసరావును స్థానికులు అంబులెన్సులో తణుకు ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.